
క్లుప్తంగా

నేడు మండల సమావేశం

రాయచోటి అర్బన్: రాయచోటి రూరల్ మండల సర్వసభ్యసమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ సబాభవనంలో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని ఎంపీపీ పల్లవు రాజమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీడీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ట


ప్రసన్న లక్ష్మీవేంకటేశ్వర మూల విరాట్

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయితీ ఎర్రంగివాండ్లపల్లెలో మూడు రోడ్ల కూడలిలోని శ్రీ ప్రసన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఆదిరెడ్డి శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. శనివారం ఆలయంలో నిత్యపూజలు, గణపతి స్వస్తివాచనం, భగవత్ ప్రార్ధనలో జపాలు, హోమాలు, వేద పారాయణం, లఘు పూర్ణాహుతి, ఆదివారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం


మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వివేకానందరెడ్డి తదితరులు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డి అన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువతను ఉత్తేజపరిచి పార్టీ అభివృద్ధికి పాటుపడతానని శుక్రవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో వివేకానందరెడ్డి పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నియామకానికి సహకరించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి సోయగం.. ఆధ్యాత్మిక క్షేత్రం

సంబేపల్లి మండలం అడవికమ్మపల్లె సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లుతోంది. పక్షుల కిలకిలరావాలు.. చుట్టూ గుట్టలు.. ఇలా ప్రకృతి సోయగం నడుమ వెలసిన ఈ ఆలయం పరిసరాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతిష్ఠించిన అక్కదేవతలు భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్నారు. ఇక్కడి కొలనులో స్నానమాచరించి భక్తి శ్రద్ధలతో తల్లులను వేడుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వాసం. ఈ ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి తర్వాత తిరునాల నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది.

- రేపు అక్కదేవతల తిరునాల
- వారాల తల్లులుగా ప్రసిద్ధి
- ముస్తాబైన ఆలయం

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె సమీపంలో కొలువైన అక్కదేవతలు, శివలింగేశ్వరుడు భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్నారు. ప్రతి ఏడాది శివరాత్రి తర్వాత ఇక్కడ అక్కదేవతల తిరునాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతర రోజు వచ్చిన భక్తులు అక్కదేవతల కొలనులో స్నానమాచరించి, తడిబట్టలతో అగ్నిగుండ ప్రవేశం చేసి, గర్భాలయంలోని శివలింగేశ్వరుడైన మహాదేవున్ని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. అక్కదేవతలను భక్తి శ్రద్ధలతో వేడుకుంటే కోరికలు తప్పకుండా నిరవేరతాయని భక్తుల నమ్మకం. భక్తుల కోరికలను తీరుస్తూ వరాల తల్లులుగా బాసిల్లుతోంది.


ప్రత్యేక అలంకరణలో శివలింగేశ్వరుడు


జాతరకు ముస్తాబైన ఆలయం

ఏర్పాట్లు పూర్తి

ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం నుంచి ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. రాత్రికి చాందినిబండ్ల ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సోమవారం తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందన్నారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరునాలకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ఆలయ చరిత్ర

70 సంవత్సరాల క్రితం అడవికమ్మపల్లె, పాళెంగడ్డ మార్గమధ్యంలో ఉన్న నల్ల గుట్టలో శివలింగం ప్రత్యక్షమైయిందని, పక్కనే ఉన్న అక్కదేవతల కొలను దగ్గరకు తీసుకొచ్చి శివలింగాన్ని ప్రతిష్ఠించారని అడవికమ్మపల్లె గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతి శుక్రవారం ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు.

మహిళలే సమాజానికి ఆయువుపట్టు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న జి. శ్రీకాంత్ రెడ్డి (ఫైల్)

రాయచోటి: మహిళలే సమాజానికి ఆయువుపట్టు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మహిళలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నడియాడుతారనేది సత్యమని శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. స్త్రీ లేనిదే జీవం, గమనం, సృష్టి లేవన్నారు. మహిళా సాధికారికత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా

రాయచోటి అర్బన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో తాగునీటి సమస్యను తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, నీటి విభాగం సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి పైపులైన్ లేని, మరమ్మతులకు గురైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. రాయచోటికి సరఫరా అయ్యే వెలిగల్లు వాటర్ స్కీంకు చెందిన డబ్ల్యూటీపీ, ఇంటెక్‌వెల్ వాటర్ సెక్షన్ సిబ్బంది సక్రమంగా నీటిని సరఫరా చేయకపోతుండడంతో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంపై మున్సిపల్ డీఈ, ఏఈపై ఫయాజ్ బాషా మండిపడ్డారు. మున్సిపల్ పరిధిలో పైపులైన్ మరమ్మతులు చేసి నీరు సరఫరా చేయాలని పిట్టర్ రామక్రిష్ణకు చైర్మన్ సూచించారు. సమావేశంలో కౌన్సిలర్‌లు హారూన్‌బాషా, ఈశ్వర్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్‌కుమార్, జానం రవీంద్ర, అన్నా సలీం ,ఇర్ఫాన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


32 వార్డు కౌన్సిలర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం: మండలంలోని హసనాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. గొల్లపల్లె పప్పిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి హసనాపురం వెళ్లి ఈశ్వర్‌రెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే శస్త్ర చికిత్స చేయించుకున్న పప్పిరెడ్డి నాగభూషన్‌రెడ్డి కూడా పరామర్శించారు. మాజీ డీలర్ మహబూబ్‌బాషా సోదరుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజనేయులు, మాజీ సర్పంచ్‌లు రాజారెడ్డి, వెంకటేసు, నాయకులు చలమారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, ఆంజనేయరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఆరీపుల్లా, అల్లాబకాష్, సుధాకర్ పాల్గొన్నారు.

మహిళ కౌన్సిలర్‌కు పరామర్శ

రాయచోటి టౌన్ : రాయచోటి 32వ వార్డు కౌన్సిలర్ అన్నమయ్య జిల్లా వాల్మీకీ సంఘం అధ్యక్షుడు బుజ్జిబాబు భార్య గువ్వల లక్ష్మీదేవి కుటుంబాన్ని వైఎస్సార్ సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని పాత రాయచోటికి వచ్చిన సందర్భంగా ఆమె అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న వారి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలతో పాటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సంతాపం

రాయచోటి విశ్రాంత సానిటరీ మేస్త్రీ 33వ వార్డు కౌన్సిలర్ నేలపాటి జ్యోష్ణ మామయ్య అన్నయ్య మృతిపై రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి విజయ భాస్కర్, నాయకులు సుగవాసి శ్యామ్, గోపాల్‌రెడ్డి, కొత్తిమీరప్రసాద్, మాజీ డీలర్ శ్రీను, అశోక్‌కుమార్, రెడ్డెయ్య, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు కొత్తపల్లె ఇంతియాజ్, జగదీష్, జగన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎస్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు : ఎన్ఎంఎస్‌కు చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎర్రతోటి ప్రవల్లిక ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన నేషనల్ మెరిట్ స్కూలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ప్రవల్లికకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ. 12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలపాటు అందుతుందని పేర్కొన్నారు. అలాగే చక్రంపేట ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థికి కూడా రూ.10 వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విలీనం ఆపాలి

ఒంటిమిట్ట: సంస్కరణల పేరుతో పెద్దకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలోని 3,4,5వ తరగతులను ఒంటిమిట్ట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనాన్ని ఆపాలని, ప్రాథమిక పాఠశాలగానే ఉంచాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పెద్దకొత్తపల్లి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మద్దిరాల రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తరగతుల విలీన ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు.

మామిడి తోటకు నిప్పు

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం రెవెన్యూ గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలోని సర్వే నంబర్ 1,152, 1,153లో మామిడితోటకు నిప్పంటించినట్లు రైతులు నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 7 ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటకు నిప్పంటించడంతో 80 చెట్లకు పైగా దహనమైనట్లు తెలిపారు. కాలిపోయిన మామిడితోటను మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన వ్యవసాయ సహాయకులు రెడ్డినాయక్ శుక్రవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్

జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

గాలివీడు : విద్యతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గౌతమ్ పాఠశాల, రవిచంద్ర పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిర్దేశించిన మార్గదర్శకాలను విద్యార్థులు పాటించాలని సూచించారు. తరగతి గదిలో బోధించిన విషయాలు విద్యార్థుల జీవితాలపై చాలా ప్రభావం చూపడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు జీవితంలో తొలిమెట్టు అని, అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, మోటివేట్ స్పీకర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


నిర్మాణ పనులను అడుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత వీఆర్ఓ శివశంకర్ మాట్లాడుతూ సర్వే నంబర్ 424/2లో మూడు సెంట్ల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణ పనులను అడ్డుకొని నిలిపేశామన్నారు. నిర్మాణలు చేపడుతున్న వ్యక్తిని స్థలానికి సంబంధించిన పత్రాలను తీసుకొని తహసీల్దారు కార్యాలయానికి రావాలని చెప్పామన్నారు. అప్పటివరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించామని వీఆర్ఓ తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామంలో ఉప్పరపల్లె లోని సర్వే నంబర్ 521/1, 424లోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది భూమి చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత ఆదేశాల మేరకు చదును చేసిన ప్రభుత్వ స్థలాన్ని వీఆర్ఓ శివశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ వెంకటసుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి తిరునాల


పూజలందుకున్న గంగమ్మ తల్లి

ఒంటిమిట్ట: మండలంలోని మలకాటిపల్లి, సాలాబాద్ సమీపంలోగల పవిత్ర వీర గంగమ్మ తిరునాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పంచామృతాభిషేకంతో అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, అమ్మవారి హోమం, వాస్తు హోమం, లక్ష్మీనారాయణ హోమం లాంటి విశిష్ట యాగాలు చేశారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకారించి హారతులిచ్చారు.

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మకు శుక్రవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

వీరబల్లి: వీరబల్లిలోని గంగమ్మ ఆలయంలో శనివారం నుంచి జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పణతో జాతర ముగుస్తుందన్నారు. శనివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

‘మేడా’ దిగజారుడు రాజకీయాలు చేయవద్దు

– వైఎస్ఆర్‌సీపీ నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సుండుపల్లె : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిపై అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డిపై వైఎస్ఆర్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఆరంరెడ్డి, మైనార్టీ నాయకులు రెహమాన్‌ఖాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడా విజయశేఖర్‌రెడ్డి స్థాయి మరిచి వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. వార్డుమెంబర్‌గా గెలవని విజయశేఖర్‌రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలను విమర్శించే స్థాయి విజయశేఖర్‌రెడ్డికి లేదని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలతో మేడా మల్లిఖార్జునరెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశారని పేర్కొన్నారు. కోఆప్షన్ కలీమ్‌బాషా, ఎంపీటీసీ నాగేశ్వరరావు, మజహర్‌లతో పాటు వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

పుల్లంపేట: మండల పరిధిలోని అధికలోడు కలిగిన విద్యుత్ గృహ వినియోగదారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ పత్తిపాటి కుమార్ తెలిపారు. డెవలప్మెంట్ చార్జీలు రూ. 2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 200, సర్వీస్ చార్జీ రూ.100, అప్లికేషన్ ఫీజు రూ. 50, ఒక కిలోవాట్‌కు రూ. 2350 కాగా ప్రభుత్వం యాభైశాతం సబ్సిడీ కల్పిస్తుందని ఈ అవకాశాన్ని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యతోనే మహిళా సాధికారత


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధ్యాపకులు

రాజంపేట: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కడప వై వి యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. పద్మ అన్నారు. శుక్రవారం రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. పద్మ మాట్లాడుతూ మహిళా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.ఆర్. గౌతమి మాట్లాడుతూ మహిళలకు విద్య, పరిశోధన రంగాల్లో మరింత మద్దతు అందిచాల్సిన అవసరాన్ని అభిప్రాయపడ్డారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ సి. గంగిరెడ్డి, ఉపకులపతి సాయిబాబారెడ్డి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ సి. అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి జగదాంబసెంటర్ : మహిళా సాధికారతతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్బీఐ చీఫ్ మేనేజర్ ఎస్‌డీపీఎస్ జగదీష్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాయచోటి ప్రధాన బ్రాంచ్‌లో సాయి ప్రశాంతి ఆసుపత్రి, డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ ఆంజనేయులు, ఏఎల్‌డీఎం మన్సూరు బాషా పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

రాజంపేట టౌన్: ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.పరిమల తెలిపారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కుటుంబం, సమాజం, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనేక అంశంపై రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. రాజంపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు బచోటి భాస్కర్, సాంబశివనాయుడు, ఓబులేసు, మందా శివయ్య, సునీల్, మండ్ల శ్రీహరి, కల్యాణ్, నరసింహ, రాయులు వెంకటసుబ్బయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

రామాపురం: లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండల సెక్టర్‌లోని సూర్యనారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సూపర్‌వైజర్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపర్‌వైజర్ హుశేనమ్మ, సుజాత, పద్మజరాణి, వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రాయచోటి ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో శ్రామిక మహిళా సంఘం, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సుగుణమ్మ మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాక్షించారు. ప్రిన్సిపాల్ హైదర్ అలీ సీఐటీయూ జిల్లా కార్యదర్శులు రామాంజులు, భాగ్యలక్ష్మి, అధ్యాపకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సర్పంచ్ చంద్రమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం, కస్పా ఈడిగపల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రుణాలు అందించడమే కాకుండా ఉపాధిని కూడా కల్పిస్తుందన్నారు. ప్రతి మహిళా డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా చేరాలని కోరారు. వార్డు మెంబర్లు టి. అనుసూయమ్మ, టి. సుగుణమ్మ, అంగన్‌వాడీ వర్కర్ నాగవేణి, వంశీకృష్ణ పాల్గొన్నారు.